

# పరువు

గోవిందరాజు సీతాదేవి

హైదరాబాద్ - ఆనందనగర్‌లో ఓ చిన్న యిల్లు. అందులో మరీ చిన్న చిన్నవి పది కాపరాలు. ఆ వాటాల్లోకల్లా అతిచిన్నదైన ఒక గదిలో అద్దెకున్నారు ప్రభాకరం జయలక్ష్మి. ప్రభాకరానికి చేస్తూన్న వుద్యోగం కాస్తా పోయి రెండు నెలలైంది. ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తూన్నాడే కానీ ఏ ఒక్కటీ దొరక

లేదు. అసలు దొరుకుతుందనే ఆశ కూడా లేదు. అయినా ప్రయత్నిస్తూనే వున్నాడు.

ఆ చిన్న గదికి అరవై అయిదు రూపాయలు అద్దె. అయినా ఆ యింటి కనక మహాలక్ష్మికి సంతృప్తి లేదు. మా రోడ్డున ఎవ్వరూ యింత తక్కువ అద్దె కిచ్చిన వాళ్ళు వున్నారేమో చెప్పండీ అంటూ తన దాతృత్వం తనే గొప్పగా చెప్పుకుంటూ వుంటుంది. జయలక్ష్మి వాళ్ళా ఎంత చిన్న యింట్లో వున్నా వచ్చీ పోయే చుట్టాలకి మాత్రం కొదువ లేదు. అయ్యో అతనికి వుద్యోగం యింకా దొరకలేదూ! అంటూ సానుభూతి నటిస్తూనే వాళ్ళ పని అయేవరకూ వుండి ఆ పైన వెళ్ళిపోతూ వుంటారు. పిల్లలు కూడా లేని యిల్లు కావటం అతిథులకి చాలా హాయిగా వుంటుంది.

మూడు రోజులుగా అసలు కుంపటయినా అంటించని జయలక్ష్మి నీరసంగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది ... కళ్ళల్లో నీళ్ళు కూడా యింకిపోయినాయి.

"అమ్మా జయా!" అంటూ టాక్సీ దిగింది కామేశ్వరమ్మ నలుగురు పిల్లలతో.

ఎవరో ..గుర్తే రాలేదు జయలక్ష్మికి. అయినా ఆవిడే గుర్తుకు తెచ్చింది.

"మీ అక్కయ్యగారి యింటి ప్రక్కన వుండే వాళ్ళం కాదుటోయ్! ఏలూరులో .."

ఆ! ....కామేశ్వరమ్మకీ, యీమెకీ చాలా వ్యత్యాసం కన్పిస్తూంటే పోలికవి గుర్తు తెచ్చుకుని వీళ్ళకింత అయిశ్వర్యం ఎలా వచ్చిందబ్బా అనుకుని నిస్తు పోయింది. కామేశ్వరమ్మ భర్తది చిన్న వుద్యోగమే! కానీ ఆవిడది చాలా భారీ చెయ్యి. ఆయన సంపాదన ఆవిడ పౌడర్లకి సరిపోదు అనుకునే వారు అందరూ. ఏది ఏమైనా యింత భాగ్యం ఎలా వచ్చి వుంటుందీ అని పిచ్చి చూపులు చూస్తూంటే కామేశ్వరమ్మ ఆప్యాయంగా జయలక్ష్మి భుజం మీద చెయ్యి వేసి—

"పిచ్చి తల్లీ! ఎంత మారు రూపు పడిందే ...ఒరేయ్ పిల్లలూ! జయక్కకి నమస్తే చెప్పండి!" అంటూ పరిచయం చేసింది. వాళ్ళు నలుగురూ ముద్దుగా

---

ఉపాధ్యాయుడు ; గోపీ!... కాకివలన మన కేమైనా ఉపయోగము ఉందా?....
గోపి : లేకేం సార్!....ప్రక్కవాళ్ళింట్లో గరిటలు, చెంచాలు, సబ్బులు మనింట్లో పడేస్తాయి!"
ఉపాధ్యాయుడు ; ఛీ....నోర్ముయ్! నెక్స్ట్....
నెక్స్ట్ ; తద్దినాలు పెట్టేటప్పుడు పిండాలు తినడానికి పనికొస్తాయి సార్!....
—రామవరపు గిరిజాశంకరి, విశాఖపట్నం—1

'నమస్తే' చెప్పారు. టాక్సీ డ్రైవర్ సామాను లోపల పెడుతూంటే జయలక్ష్మి పైప్రాణం పైన పోయింది. కామేశ్వరమ్మ పెద్దకూతురు భోషాణమంత హేండ్ బాగ్ తెరిచి అయిదు రూపాయల కాగితం నిర్లక్ష్యంగా విసిరి చిల్లరైనా తిరిగి తీసుకోకుండా లోపలకి వచ్చేసింది. జయలక్ష్మికి ఒళ్ళంతా నీళ్ళు కారిపోతోంది ... వీళ్ళకి ఏం పెట్టాలి అని

"జయా! ఇది పెద్దది మేనక. ఇది రెండోది వూర్వశి. ఆ యిద్దరూ కిట్టూ, పిస్సూ. ఆ అల్లుడుగారింకా ఆఫీసు నించి రాలేదామ్మా. కాపిని నీళ్లయిస్తే స్నానం అదీ చేస్తాం...ముందు తలనొప్పి పగిలిపోతోందమ్మా, కాస్త కాఫీ యివ్వు - నా స్నానం త్వరగా కానిస్తాను."

పిల్లలు సామానంతా యింటి నిండా పరిచేశారు. పెద్ద సూటుకేస్. హోల్డాల్ స్టీలు కారియర్. స్టీలుదే మర చెంబూ, పెద్ద బాస్కెట్. కాఫీ ఫ్లాస్కూ.

"ఎన్ని రోజులుంటారో .." గుండె గుబగుబ లాడుతూన్నా కుంపటి వెలిగించి కాఫీకి నీళ్ళు పడేసింది. కాఫీపొడి డబ్బా మూత తియ్యకుండానే గుర్తుకొచ్చింది. అది ఖాళీ అయి చాలా రోజులే అయిందని అవమానం, దుఃఖం, ఏం చెయ్యలేని అశక్తతా అన్నీ కలిపి కన్నీటి రూపంతో ప్రవహిస్తూన్నాయి.

"మమ్మీ! నౌబత్ పహాడ్ యిప్పుడే చూసేద్దాం" అంటూ పిల్లలందరూ బట్టలు పెట్టుకొని రెడీ అయినారు.


వంట యింట్లో వున్న జయలక్ష్మి ఎంతకీ బయటికి రాదు.

"జయా! కాఫీ తయారయిందా? ...' అంటోంది కామేశ్వరమ్మ అద్దం ముందు కూర్చుని. వచ్చేప్పుడు పెట్టుకున్న నగల సెట్ మార్చి, ఎర్ర రాళ్ళ అడ్డిగా, అదే రంగు గాజులూ, ఎర్ర పట్టు చీరా, అదే రంగు రెవికా. అదే రంగు 'శాయీ' వెనకనించి వేసుకుని, తలలో కనకాంబరాల మాల దాదాపు పది మూరలది పెట్టుకుంటూ, కళ్ళద్దాలు సరి చేసుకుని వెనక్కి తిరిగింది.

ఊర్వశి అందమైన అంచున్న లుంగీ కట్టుకుని,దానికి మేచింగ్ షర్టు వేసుకుంది. మేనక పాంటూ-షర్టూ వేసి, బెత్తెడు వెడల్పు బెల్టు బిగించింది, బాబ్డ్ హెయిర్ నీట్‌గా దువ్వింది. మగపిల్లలిద్దరూ టెర్లిన్ బట్టల్లో వులెన్ స్వెటర్లు వేసుకుని రెడీ అయారు.

జయలక్ష్మి కాళ్ళీడ్చుకుంటూ ప్రక్కయింటి కాశీరత్నం దగ్గరకి వెళ్ళింది. అప్పటికి నాలుగు సార్లన్నా అప్పు పెట్టిన కాశీరత్నం ముఖం మాడ్చుకున్నా జయలక్ష్మి స్థితికి జాలి పడి లేదనటానికి నోరు రాక నాలుగు చెంచాలే వుంది అంటూ అందించింది.

ఆ పొడితో ఎలాగో కాఫీ తయారు



చేసిందే కానీ వాళ్ళు తాగుతారా? అయినా అందించింది. గ్లాసులోకి తొంగి చూసి ప్రక్కన పెట్టేశారు వూర్వశీ, మేనకా, కాస్త ఎంగిలి చేసి వదిలేసింది కామేశ్వరమ్మ.

"మాకు బోర్న్‌విటా!" అంటూ గోల చేశారు మగపిల్లలు.

మా యింట్లో అలాంటివి ఉండవు అని చెప్పటం ఎంత కష్టం అయినా ఇలాంటి వాటికి అలవాటు పడ్డ జయలక్ష్మి నవ్వు ముఖాన పుఠముకువి చెప్పేసింది.

కామేశ్వరమ్మ కొడుకులని మందలిస్తూ—

"అమ్మా జయా! మేం రావటానికి చాలా ఆలశ్యం కావచ్చు. అల్లుడుగారు ఆఫీసు నించి వస్తే భోజనం చేసేయమను. నువ్వా సుమ్మా! వీళ్ళందరినీ కాస్త అలా తిప్పి తీసుకొస్తాను. హైదరాబాద్ చూడ లేదో అంటూ ఒకటే గొడవ పెట్టేస్తుంటే తీసుకొచ్చాను. ఆఁ వస్తాం" అంటూ పిల్లలని వెంటేసుకుని ఆవిడ వెళ్ళిపోయింది

ఈ హైక్లాసు కుటుంబం తిరిగి-తిరిగి వచ్చేసరికి నేను ఆతిధ్యం యివ్వాలి. కానీ ..ఎలా?..ఎలా సాధ్యం అవుతుందీ? ఇంట్లో ఒక్క బియ్యం గింజ కూడా లేదు. ప్రభాకర్ ప్రొద్దుటనగా యిల్లు విడిచి వెళ్ళాడు. ఇంకా తిరిగి రాలేదు.

అతను లేడని అనుకోవటమేగానీ వుంటే మాత్రం ఏం చేస్తాడు. ఉద్యోగం వున్నప్పుడే యీ చుట్టాల బెడద ఆ యిద్దరి సహనాన్నీ పరీక్షకి పెట్టేది. ఒక్కొక్కరు వెళ్ళేసరికి పచారు దుకాణంలో పద్దు పెరిగిపోయేది. అది తీర్చుకోక ముందే మరో కుటుంబం ఏవేవో అవసరాలంటూ వచ్చి తిష్ట వేసేశారు.

"ఈ గోల నేనింక భరించలేను వాళ్ళని వెళ్ళిపొమ్మని చెప్పు!" అంటూ ప్రభాకరం మండి పడేవాడు.

"అలా అంటే పరువు పోదూ!... ఇల్లన్న తర్వాత ఎవ్వరూ రాకుండా వుంటారా?" అంటూ భర్తకి నచ్చజెప్ప జూసేది జయలక్ష్మి.

చిరచిర లాడుతూనే అప్పులు చేసి తెచ్చి పడేసి చివరికి వాళ్ల వెళ్ళిన తర్వాత తీరుబడిగా తగూకి దిగేవాడు. రెండు-మూడు రోజులు యిద్దరూ వుపవాసాలు వున్న తర్వాతగానీ రాజీకి రాలేక పోయే వారు. ఉద్యోగం వున్నప్పుడే అంతంత అవస్థలు....ఇప్పుడు వుద్యోగమే లేదు. ఈ రోజు గడిచేదెలా? అప్పుడే టైము చాలా అయివుంటుంది అంటూ నిట్టూర్చింది జయలక్ష్మి.

ప్రభాకరం తలుపు తోసుకుని వుసూరుమంటూ వచ్చాడు. ఎదురుగా పెద్ద రాశిసుల్లా కన్పించాయి. లెదర్ కేసూ దయ్యమంత హోల్డాలూ. స్టీలు కారియర్, మర చెంబూ, అందరూ విడిచి పడేసిన బట్టలూ ...

కామేశ్వరమ్మ వస్తూనే తలలో నించి తీసిపారేసిన నాలుగు మూరల కదంబ మాలా సగం వాడిపోయి వుంది.

ఏడుపు ముఖంతో కూర్చున్న జయలక్ష్మిని చూడగానే వళ్ళు భగ్గుమంది ప్రభాకరానికి.

"మళ్ళీ ఎవరు తగలడ్డారు? ఎవరు వచ్చినా సరే నా మొగుడికి వుద్యోగం పోయింది. మేమే పస్తులుండలేక పస్తున్నాము. మీకేం పెట్టలేం మహానుభావుల్లారా! దయచేసి వెళ్ళి పొండి అని ఖచ్చితంగా చెప్పమని ఎన్ని వందల సార్లు చెప్పాను నీకు. అసలు వీళ్ళని లోపలకి

---

● టీచరు ; "రామూ! —పుటాకార, కుంభాకార కటకాలకి ఏవైనా ఉదాహరణలు చెప్పగలవా?...."

రాము : "మరే....పుటాకారకటకాలికి మా బామ్మ దవడలు; కుంభాకార కటకాలికి మా నాన్న బుగ్గలుస్సార్...."

—రామవరపు గిరిజాశంకర్, విశాఖపట్నం—1

ఎందుకు రానివ్వావ్....'' కడుపులో కర కరమంటున్న ప్రభాకరం పిచ్చిగా కేకలు మొదలెట్టాడు. ప్రొద్దున తాగిన మంచినీళ్ళ కడుపులో తిప్పి తిప్పి పెద్దగా వాంతి అయింది. మళ్ళీ ఆకలి బాధ ప్రారంభమైంది. ఆకలిని జయించలేని ప్రభాకరం ఆ క్షణాన వున్మత్తుడిలా జయలక్ష్మి మీద కొచ్చాడు.

జయలక్ష్మికి కన్నీళ్ళు కూడా రావటం లేదు. సహనం సన్నగిల్లుతున్నా కూడ దీసుకుంటూ చెప్పింది.

''నేను రమ్మనలేదు. వాళ్ళే తలుపు నెట్టుకుని లోపలకి వచ్చారు. ఈ సామానంతా యిల్లంతా పర్చారు. వచ్చిన వాళ్ళని బయటకి వెళ్ళకొట్టటం చేతకాక యిలా కూర్చున్నాను.''

''ఏదవలేక పోయావ్... పరువు-పరువు అంటూ నన్నీ స్థితికి తెచ్చావు .. నాకింక సహించే శక్తి లేదు. అందుకే వెళ్ళిపోతూన్నా ..వారం రోజుల వరకూ ఈ ఛాయలకి రాను. నీ చావు .నువ్వు చావు....చేతకాని అసమర్థురాలా.... అనుభవించు ..." అంటూ వెడుతూన్న భర్త దగ్గరకి పరుగెత్తుకొచ్చింది జయలక్ష్మి.

''ఆ పని చెయ్యకండి. మీకు దణ్ణం పెడతాను.''


ఫోన్ : 551

డా: పి. కుమారస్వామి దేవర

ట్రావెలర్స్ బంగళారోడ్డు, తెనాలి (ఎ పి)

బ్రాంచి: 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17

దీర్ఘ రోగులకు ఉత్తమ వైద్యము



హస్తప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగకాలమందు అకస్మాత్తుగా కృశించుట శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కనివిని ఎరుగనంత వీర్యస్తంభనకల్గిహాయినిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినవి. (స్వప్నములు) ఉబ్బసము, (దమ్ము) బోదకాళ్ళు, కుష్టు, బొల్లి చర్మవ్యాధులు' కడుపులో నొప్పి, చెవుడు. పోస్టుద్వారా గ్యారంటీ చికిత్స చేయబడును.

"నీ దణ్ణం నాకక్కరలేదు. ఇప్పుడు నాక్కావల్సింది అన్నం."

జయలక్ష్మి కన్నీళ్ళు కాల్వలై పారుతూన్నాయి.

భర్త ఆకలి కూడా తీర్చలేని తన అసమర్థతకి తనే కుళ్ళిపోయింది.

"ఏడవటం తప్ప మరేం చేతకాదని నాకు తెల్సు. ఉండు నేనే వాళ్ళని బైటకి గెంటేస్తాను. నీ పరువు పోతే పోయింది. నాకీ నరకం తప్పుతుంది" అంటూ స్టీలు కారియర్ బాస్కెట్ వాకిట్లోకి విసురుగా గిరాటు కొట్టాడు. పెట్టె ఎత్తి బయటకి విసరబోతూండగా వూర్వశి వయ్యారంగా లోపల అడుగు పెట్టింది.

"ఓ.... సమ్మీ!" పిచ్చి కేక పెట్టింది ముఖంమీద పడబోయిన పెట్టెని తప్పించుకుంటూ.

శిలాప్రతిమలా నిల్చిపోయింది జయలక్ష్మి.

* * *

ప్రభాకరం బి. ఎ చదివే రోజుల్లో ఎంతో అందంగా-హుషారుగా ఎప్పుడూ తను నవ్వుతూ చుట్టూ వుండే వాళ్ళని నవ్విస్తూ ఎంతో సరదాగా వుండేవాడు. జయలక్ష్మి అన్నయ్య గిరి, ప్రభాకరం ప్రాణ స్నేహితులు. ఇవన్నీ గాక ప్రభాకరం బాడ్మింటన్ ప్లేయరు చాలా బాగా ఆడతాడు అతని మాచ్ వున్నప్పుడల్లా జయలక్ష్మి అన్నగారితో కల్సి వెళ్ళి చూస్తూ వుండేది. అతని కళ్ళలోని ఏదో శక్తి జయలక్ష్మిని అయస్కాంతంలా లాగేసింది.

అతన్నే పెళ్ళి చేసుకుంటా అని పట్టు పట్టింది.

"అతనికి చదువు తప్ప సరైన వుద్యోగం గానీ వెనుక ఆస్తి గానీ లేవు. వీల్లేదు" అన్న తల్లిదండ్రుల మాట చచ్చినా వినలేదు.

ప్రభాకరం కూడా జయలక్ష్మికి నచ్చ జెప్ప జూశాడు.

"నా జీవితం అతి సామాన్యమైంది. సరైన వుద్యోగాన్ని కూడా యింకా సంపాదించుకోలేక పోయాను. నలుగురు అన్నదమ్ములకీ ఒకే చెల్లెలై ఉల్లాముద్దుగా పెరిగిన నీకు ఆర్థిక దుస్థితి భరించేశక్తి వుండదు. జయా! నన్ను మర్చిపో...." అని ఎంతో చెప్పాడు.

జయలక్ష్మి కొంచెం కూడా వినలేదు.

అయితే నీకూ నాకూ సంబంధం లేదు అని తండ్రి తలుపు మూసేశాడు. ప్రభాకరం అయోమయంగా చూశాడు జయలక్ష్మిని.

"పదండి మన యింటికి వెడదాం.... మీరు వుంటే మరెవ్వరూ అక్కరలేదు" అంటూ అతని చెయ్యి పట్టుకుని గాలిలో తేలిపోతూ ప్రభాకరం వుండే అద్దె గదిలో




గృహ ప్రవేశం చేసింది జయలక్ష్మి. ఎలాగో కంటాలు పడి హైదరాబాద్ వచ్చి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు ప్రభాకరం.

జీతం తక్కువే అయినా రెండు సంవత్సరాలు స్వర్గసుఖాల్లో తేలియాడారు .. పిల్లలు కలగకుండా ఉండే జాగ్రత్త తీసుకున్నారు. తనని నమ్మి అందరినీ దూరం చేసుకున్న జయని ఎప్పుడూ సుఖపెట్టాలనే ప్రయత్నించేవాడు ప్రభాకరం. జయలక్ష్మిలో కాస్త కూడా అసంతృప్తి లేదు.

కానీ మధ్య-మధ్యన చుట్టాల గొడవ భరించటం చాలా కష్టమైపోతోంది ఆ భార్యాభర్తలిద్దరికీ. జయలక్ష్మి పుట్టింటి వారికి దూరమైనా మిగతా చుట్టాలు వచ్చి తమ అవసరాలు గడుపుకుని వెళ్ళిపోతూనే ఉంటారు.

ఉద్యోగం కూడా పోవటంతో ప్రభాకరంలోని సహనం చచ్చిపోయింది .. చీటికీ మాటికీ చిరచిరమంటూ ఉన్నాడు. జయలక్ష్మికీ లోపల బాధగానే ఉంది. కానీ ఏం చెయ్యలేక నోరు మూసుకు ఉండిపోయింది.

ప్రభాకరం ప్రొద్దున ఒక స్నేహితుడి దగ్గరకి వెళ్ళి నాలుగు రూపాయలు అప్పు

కావాలని అడిగి అతను హేళనగా ఏదేదో మాట్లాడేసరికి చాచి చెంపలు పగిలేలా కొట్టి ఆ మాటకి కడుపులో మంట తోడై యింటికి వచ్చాడు. ఇక్కడ ఆకలికి అన్నం లేకపోతే పోనీ ప్రశాంతంగా కళ్ళు మూసుకుని పడుకునేందుకు కూడా వీల్లేక మరీ మండిపోయి అన్నీ బైటకి గిరాట్టు కొడుతూండగా పూర్వశి వయ్యారంగా వచ్చి అమ్మో అంటూ కేక పెట్టేసరికి ప్రభాకరంలో అప్పటివరకూ వున్న ఆవేశం మెల్లగా దిగిపోయింది.

"ఏమిటే అంత లావు కేక పెట్టావ్" కామేశ్వరమ్మ తన భారమైన శరీరాన్ని యీడ్చుకుంటూ లోపలకొచ్చింది.

వీళ్ళు-మా యింటికి వచ్చిన చుట్టాలా! పెద్ద జమీందారీ ఫాయాగా కన్పిస్తున్న వీళ్ళు మా యింటికి వచ్చారా! ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు ప్రభాకరం.

"అమ్మాయి!... జయా! ..అల్లుడుగారేగా:" అంటూ ముసి-ముసి నవ్వులు నవ్వింది కామేశ్వరమ్మ.

"న....నమస్కారం!" ప్రభాకరం అప్రయత్నంగానే చేతులెత్తి నమస్కరించాడు. జయలక్ష్మి గుండె కాస్త కుదుట పడింది

"ఇది పూర్వశి; ఇది మేనక.... వీళ్ళిద్దరూ మగపిల్లలు. జయ చిన్నప్పుడు వాళ్ళ అక్క దగ్గర వుంది కొన్నాళ్ళు.... అప్పుడు ఎంత బాగుండేదనీ! ఇప్పుడసలు ఆ రూపమేలేదు. చాలా పాడై పోయింది. కళ్ళల్లో ప్రాణాలు పున్నాయి మీరూ అలాగే పున్నారనుకోండీ ...అం-ఇంతకీ యింటికొచ్చి ఎంత సేపయిందీ? అమ్మా! జయా? అల్లుడుగారు భోజనం చేశారా లేదా? నీకు తగని మొహమాటం. నేను చెప్పేశానుగా మాకోసం వెయిట్ చెయ్య వద్దనీ!" కామేశ్వరమ్మ భుజాల మీద కప్పుకున్న 'షాంలూ' మెల్లగా తీసింది. మెడలోని రాళ్ళ నెక్లెస్ ధగధగ లాడుతోంది.

ప్రభాకరానికి చప్పున తన కర్తవ్యం గురుకొచ్చింది. జయ వీళ్ళందరికీ ఏం వండి వడ్డిస్తుందీ ...వెళ్ళాలి ఎక్కడైనా

---

● ఫారెన్‌లో పి. హెచ్. డి. తీసుకొన్న ఒక సైన్సు లెక్చరర్ మెమోగా ఓ ఇంటర్మీడియట్ క్లాస్ కెళ్ళి ఏదో చెపుతున్నాడు. 'డిరక్షన్' అన్న పదానికి తెనుగులో ఏం చెప్పాలో తెలీక ఇటు అటు చూస్తున్నాడు. ఇంతలో ఓ స్టూడెంటు ఇలా అరిచేడు —

"దర్శకత్వం సార్! ..."

—రామవరపు గిరిజాశంకర్. విశాఖపట్నం—1

సరే-తల తాకట్టు పెట్టి అయినా సరే— అప్పు తేవాలి అనుకుంటూ చెప్పులు వేసుకుని గబగబా బైటకి పోబోతూంటే కామేశ్వరమ్మ గావుకేక పెట్టింది.

"అయ్యో ఎక్కడికి నాయనా మరీ వెడుతున్నావూ.... పోనీ అంతగా పని వుంటే ఈ కాస్త ఫలహారం చేసి వెళ్ళు'' అంటూ జయని ప్లేట్లు తెమ్మని తను బజారు నించి తెచ్చిన స్వీట్లూ, పళ్ళూ అన్నీ సర్ది అందరికీ యిమ్మని చెప్పింది.

జయ అందరికీ ఫలహారం ప్లేట్లు అందించి, భర్తకి కూడా అందించింది.

జయ కళ్ళు గర్వంగా మెరుస్తున్నట్లుగా కన్పించాయి ప్రభాకరానికి.

''చూడు నాకు తెల్సిన వాళ్ళు కూడా ఎంత శ్రీమంతులో...నన్ను వెతుక్కుంటూ ఎలా వచ్చారో!'' అన్నట్లుగా వుంది.

"అంకుల్! మీరు బాట్‌మింటన్ ప్లేయర్‌ట కదూ! చాలా బాగా ఆడతారుట. అవన్నీ చూసే జయక్క మిమ్మల్ని...." సిగ్గుతో ఆగిపోయింది మేనక.

ప్రభాకరంలో ఎన్నో రోజుల తర్వాత


# బ్యాంకులో డబ్బు దాచుకొంటే బహువిధాల లాభాలున్నాయి

1. సేవింగ్సు ఖాతా మీద వడ్డీ 4% PA
2. మత ధర్మ సంస్థల డిపాజిట్లకు,
   దేవాలయ డిపాజిట్లకు, సేవింగ్సు అకౌంట్లమీదనూ,
   మామూలు రేటుకన్న ½% ఎక్కువ వడ్డీ ఇవ్వబడును.
3. డిపాజిట్లమీద వచ్చే వడ్డీ రు. 3,000ల వరకు
   ఆదాయపు పన్నులేదు.
4. బ్యాంకులో ఉంచుకొన్న డిపాజిట్లమీద రు. 1,50,000ల
   వరకు ఆస్తి పన్నులేదు.

ఇతర వివరాలు మీకు సమీపంలో వుండే మా బ్రాంచి ఏజెంటును అడిగి తెలుసుకోండి.



ది ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్
సెంట్రల్ ఆఫీసు: సుల్తాన్ బజార్,
హైదరాబాదు
ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక
బ్రాంచీలుగల బ్యాంకు

కె. గోపాలరావు ఛైర్మన్
యం.వి. సుబ్బారావు జనరల్ మేనేజర్

తనమీద తనకే ఎంతో ఆపేక్ష కల్గింది. ఆ కళ్ళల్లో చిన్న గర్వరేఖ తళుక్కుమంది. పద్దెనిమిదేళ్ళ మేనకా, యిరవై ఏళ్ళ ఊర్వశీ ప్రభాకరం దగ్గరగా కూర్చుని ఎన్నో కబుర్లు చెప్తున్నారు. కామేశ్వరమ్మ జయకి కాపిరి-కాపిరి స్వీట్లు పెడుతోంది.

* * *

కామేశ్వరమ్మ వచ్చి మూడు రోజు లయింది. ఆ మూడు రోజుల్లో ప్రభాకరం అప్పు తెచ్చిన వంద రూపాయిలూ ఎగిరి పోయాయి. ఎంతో సంతోషంగా క్షణాల్లా దొర్లింది కాలం....తమ యింటికి యిది వరలో చాలా మంది చుట్టాలొచ్చారు కానీ యింత హాయిగా కబుర్లు చెప్తూ డబ్బు కోసం వెనక్కి లాక్కుండా వున్నవాళ్ళు ఒక్కరూ లేరు. కామేశ్వరమ్మ వంద రూపాయిల కాయితం అందించి "మూడు బాబూ! కాస్త చిల్లర తెచ్చి పెడుదూ!" అంది. అంతకు ముందే ఒక వందకి చిల్లర కావాలంటే జయ తన యింటావిడ నడిగి తెచ్చింది. వంటావిడ కనుక మహా లక్ష్మి తన భర్తకి తెలియకుండా దాచుకున్న డబ్బు లెక్క చూసి ఓ పది తక్కువ అంటూన్న కామేశ్వరమ్మ— "మరేం ఫర్వాలేదు. ఆ పదీ తర్వాత యిద్దువు గానీ!" అంటూ చిల్లర తీసేసుకుంది.

అబ్బ మా కామేశ్వరి పిన్ని ఎంత మంచిది అనుకుంది జయలక్ష్మి.

బైటకి వెళ్ళిన ప్రభాకరం ఎంతకీ రాలేదు.


"జయా! ఏదో సరుకులు కావాలన్నావుగా! ముందీ కాయితం మార్చి తెచ్చుకుని మిగతాది నాకివ్వు. తర్వాత చూసుకుందాం. ఈ పిల్లలున్నారే....అబ్బ దెయ్యాలంటే నమ్మూ! చూసినవన్నీ కావాలి. అందుకే ఎందుకైనా మంచిదనీ డబ్బు ఎక్కువే వుంచుకుంటాను దగ్గర...." అంటూ పర్సు తెరిచి వంద కాయితం అందించింది కామేశ్వరమ్మ. ఆ పెద్ద బ్యాగ్‌లో ఎన్నో నోట్లు కన్పించాయి జయలక్ష్మికి. అబ్బా అన్నీ వంద కాయితాలే....అనుకుంది ఒకసారి. అదృష్టవంతులు అనుకుంది మనస్సులో.

అలవాటుగా కిరాణా కొట్టు అతను అన్నీ కట్టి యిచ్చి, మరికొందరు రావటంతో జయ అందించిన కాయితం గల్లా పెట్టెలో పెట్టుకుని మిగతా చిల్లర అందించాడు.

జయ కామేశ్వరమ్మ వుదార హృదయానికి వుప్పొంగి పోతూ సామానులు కట్టిన సంచీ బరువుకి చెయ్యి నొప్పెట్టుతున్నా అలాగే మోసుకు వస్తోంది.

వెనకనించి పరుగెత్తుకొచ్చాడు సేటు.

"తల్లీ....నా కొంప ముంచావు. నాకీ నోటొద్దు....మరోటి యివ్వు." అంటూ




హడావుడి చేస్తూంటే నలుగురూ పోగైనారు.

"ఏమైందీ దానికి? సరికొత్త నోటు" అంటూ జయలక్ష్మి సెట్ అవివేకుడని, సరిగ్గా చూసుకోమనీ బిగ్గరగానే చెప్తోంది.

క్షణాల్లో పోలీస్ జీప్ వచ్చి ఆగింది అక్కడ. ఇన్‌స్పెక్టర్ శాంతం లెచ్చి పెట్టుకుంటూ అడిగాడు.

"ఇది మీదేనా? ఎక్కడ సంపాదించారూ?" అంటూ జయలక్ష్మిని పరీక్షిస్తూ.

"అవును! మాదే ...ఎందుకూ?" అంది అప్పటికీ అర్థం కాని జయ.

"మీదేనా! అయితే స్టేషన్‌కి పదండి! అక్కడే అన్ని విషయాలూ చెప్తాం!"

స్టేషన్ అనేసరికి ఖంగారు పడిపోయి "ఇది....ఇది నాది కాదు. ..కామేశ్వరి పిన్నిది, నాకేం తెలియదు." వణికిపోతూ చెప్పింది.

"ఎవరా కామేశ్వరి పిన్ని? రండి.... చూపించండి. మా కళ్ళల్లో దుమ్ము కొట్టి పారిపోతూనే వుంది. ఈసారైనా పట్టుకోవాలి...." హడావుడిగా జయని కూడా జీపు ఎక్కించుకుని యింటికి తీసుకొచ్చారు.

ఇల్లంతా బార్లగా తెరిచి వుంది.

"మీ కామేశ్వరి పిన్ని ఏదో అర్జెంట్ అంటూ యిప్పుడే వెళ్ళిపోయింది" అంది కనకమహాలక్ష్మి.

కామేశ్వరమ్మ తన పరువు పోతుందా పారిపోయింది

అభం-శుభం తెలియని జయలక్ష్మి తన పరువు బజారు పాలైందని శిలా ప్రతిమలా నిల్చి పోయింది. కనకమహాలక్ష్మి గుండె పట్టుకు కూలబడింది. •